ప్రజాశక్తి
సోమవారం 30 జూన్ 2025



రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని గురుకుల కళాశాల వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న ఘటనలో విద్యార్థి దుంప ఏసురత్నం తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి 8 గంటల సమయంలో జాతీయ రహదారిపై నడుచుకుంటూ కళాశాలకు తిరిగి వస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుందని గురుకుల కళాశాల ప్రిన్సిపల్ రామేశ్వరం తెలిపారు. మల్లవరం గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తూ విద్యార్థి ఏసురత్నంను ఢీకొట్టాడు. ఈ ఘటనలో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. కళాశాల సిబ్బంది గాయపడిన విద్యార్థిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన విద్యార్థి

బురదమయం..మన్యం రహదారులు

▶▶ అస్తవ్యస్తంగా అరకులోయ, అనంతగిరి మండలాల రోడ్లు ▶▶ అవస్థలు పడుతున్న వాహనదారులు ▶▶ పట్టించుకోని అధికారులు



బస్కీ రోడ్డులో బురదలో కూరుకుపోయిన ఆటోను తోస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం బస్కీ వెళ్ళే రహదారి మాడగడ పైనా దానిరంగిని గ్రామ సమీప ఘాటీలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా రోడ్డు బురదమయంగా మారడంతో బస్కీ వెళ్లే వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మాడగడ పంచాయతీ నందివలస జంక్షన్ నుండి బస్కీ వరకు 2023లో తారు రోడ్డు మంజూరైంది. మాడగడ పైన ఘాటిలో రోడ్డు నిర్మించకుండా గుత్తేదారుడు పనులు ఆపి వేయడంతో రోడ్డు బురద మయంగా మారింది. దీంతో బురదలో వాహనాలు కూరుకుపోయి ముందు కదలని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారుడు రోడ్డుకు ఇరువైపులా మట్టి వదిలేయడంతో రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇంత జరుగుతున్నా కనీసం గుత్తేదారుడు, అధికారులు కనీసం పట్టించుకునే పరిస్థితి లేదు.

ఈ రోడ్డుపై హుకుంపేట మండలం, బూర్జ, వేంగాడ, పట్టం పంచాయితీ, అనంతగిరి మండలం పైనంపాడు పంచాయితీ, అరకువేలి మండలం బస్కీ, మాడగడ, సుంకరమెట్ట పంచాయితీ కి చెందిన గిరిజనులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పనులు గుత్తేదారుడు పూర్తి చేయకుండా వదిలేయడంతోనే రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారిందని, తక్షణమే అధికారులు జోక్యం చేసుకొని రోడ్డు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

అనంతగిరి: మండలంలోని గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా ఏకదాటిగా కురుస్తున్న కుండపోతవానతో మారుమూల గిరిజన గ్రామాల మట్టి రోడ్లు బురదదమంగా మారాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిలకలగెడ్డ పంచాయతీ అరకు మెయిన్ రోడ్, ఫారెస్ట్ చెక్ పోస్ట్ నుండి దాసరితోట, దబ్బలపాడు, విజయనగరం జిల్లా మెంటాడం మండలం అడ్డతీగల పంచాయతీ మీదుగా అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ మరిపాలెం, పసిని. మీదుగా రొంపల్లి గ్రామం నుండి సొట్టడవలస, అనంతగిరి పంచాయతీ పెద్దూరు గ్రామం నుండి మలింగవలస, పాతకోట, .రేగం, నందిగుమి, మధిగరువు, పెద్దబాయిలు మెయిన్ రోడ్డు, రేగం నుండి తేనెపుట్టు, వాలసీ పంచాయతీ జెండాగరువు మెయిన్ రోడ్డు నుండి ఊటగెడ్డ, బుడ్డపుట్టు నుండి సీమగెడ్డ, పుట్టపాడు, తెల్లరపాడు, లొంగపర్తి పంచాయతీ మెట్టువలస నుండి నేలపాలెం, ఓనుకొండ, ఎగువపట్టి మెయిన్ రోడ్ నుండి కివర్ల పంచాయతీ బొంగిజా, ఎగువశోభ పంచాయతీ అరకు మెయిన్ రోడ్డు, కాఫీ తోటల నుండి జామగుడ, కమలాపురం, ఎన్ ఆర్ పురం, కొండిబా, పిన్నకోట, జీనబాడు తదితర గిరిజన గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్లంతా బురదమయంగా ఏర్పడటంతో 108 అంబులెన్స్, ఇతర వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. గిరిజన ప్రజలు అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లాలంటే మోకాల్లోతున అడుగేసి అడుగు తీయలేని పరిస్థితిలో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రోడ్లు బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అనంతగిరి మండలం పుట్టపాడు రోడ్డు



అనంతగిరి మండలం దబ్బలపాడు రహదారి

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతేదీ ?

-ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

అరకులోయ: అరకువేలి మండలం మారుమూల బస్కి రోడ్డు నిర్మాణం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా గుత్తేదారు ఇష్టరాజ్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని, దీనిపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పెసా కమిటీ కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. బస్కి రోడ్డులో సీసీ ర్యాంప్ వద్ద బురద మయమైన రోడ్డున ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. నందిగూడ జంక్షన్ నుండి బస్కి వరకు రోడ్డు నిర్మాణం కోసం పంచాయితీ రాజ్ ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ నిధులు రూ. 3 కోట్ల 30 లక్షల మంజూరు చేశారని, ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ ద్వారా గుత్తేదారుడు రోడ్డు పనులు చేస్తున్నారన్నారు. సీసీ ర్యాంపుల వద్ద మట్టి తీసి వదిలేశారని వర్షాలకు కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. బస్కీ నుండి నందిగూడ జంక్షన్ వరకు రోడ్డు పై తారు పూసి వదిలేశారని, కొన్ని నెలల్లోనే పెచ్చులు ఊడిపోతాయని నాణ్యత లేని రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారుడు పై తక్షణమే జిల్లా అధికారులు స్పందించి నాణ్యమైన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ప్రభుదాస్, హరి, చంటి, కొర్రా మత్యరాజు, ధనేశ్వరరావు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న బాలదేవ్



మాట్లాడుతున్న మట్ల వాణిశ్రీ

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పనిగంటలు తగ్గించాలని తదితర డిమాండ్లతో జులై 9న కార్మిక సంఘాల తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ ఆదివారం పిలుపునిచ్చారు. రాజవొమ్మంగిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు అధ్యక్షతన సిఐటియు విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాణిశ్రీ మాట్లాడుతూ. బ్రిటిష్‌వాళ్లతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నాయన్నారు. అంగన్‌వాడి, ఆశ, మిడ్డేమీల్స్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు, భవన నిర్మాణ, అంగన్‌వాడి, ఆశ, ఇతర రంగాల నాయకులు శ్రీను, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్‌లెక్చరర్స్ పోస్టుల భర్తీకై అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కర్రి సుధ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మ్యాథ్స్, జువాలజీ, ఎకనామిక్స్, కంప్యూటర్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వివరించారు. వీటికై ఎంఎ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన అభ్యర్థుల అర్హులను వివరించారు. ఎన్‌ఐటి, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు బయోడేటాను జులై 2వ తేదీ లోగా కళాశాలలో అందించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి- చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లి పేగా పంచాయతీ వంకగూడెం గ్రామానికి చెందిన మడివి కృష్ణ (24) విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే స్నానం చేసేందుకు వేడినీళ్ల కోసం కరెంట్ హీటర్ నీటిలో పెట్టి ఆదమర్చి నీరు వేడెక్కిందో లేదో చూసేందుకు హీటర్ పైకి లేపి పట్టుకోగా షాక్ తగిలి మృతి చెందాడు. మృతుని తల్లి దూలమ్మ కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుర్లు, కొడుకును పోషించుకుంటోంది. భర్తను కోల్పోయి జీవనం సాగిస్తున్న ఆమె ఇప్పుడు కుమారుడు కూడా మృతి చెందడంతో బోరున విలపించింది.

విక్రయానికి సిద్ధంగా యూరియా

ప్రజాశక్తి - రాజఒమ్మంగి : విక్రయానికి 40 టన్నులు యూరియా గోదాములో ఉన్నట్లు స్థానిక వ్యవసాయ పరపతి సంఘం సిఇఒ గోపాలకృష్ణ ఆదివారం తెలిపారు. రాజవొమ్మంగిలో 10టన్నులు యూరియా, జడ్డంగిలో 30 టన్నులు నిల్వ చేశామని తెలిపారు. అదేవిధంగా జింకు 100 బస్తాలు, వేప పిండి 300 బస్తాలు సిద్ధంగా ఉన్నాయని త్వరలో విక్రయాలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.



బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -కూనవరం: మండలంలోని పెద్ద ఆర్కుర్ పంచాయతీ పరిధిలోని గండికొత్తగూడెంలో అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో వెంకయ్య ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకుని సిపిఎం నాయకులు కుటుంబాన్ని పరామర్శించి బాధితునికి పక్కాఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో స్థానిక విఆర్ఒ రాజారావు, సిపిఎం నాయకులు జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల గిరిజన సంఘం నాయకులు తెల్లం తమ్మయ్య, పొడియం రామారావు, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు

గిరిజనేతరుల భూముల్లో జెండాలు

ప్రజాశక్తి - విఆర్.పురం: శ్రీరామగిరి పంచాయతీ పరిధిలోని చొక్కనపల్లిలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరం భూ నష్టపరహారం అందుకుని స్థానికంగా లేనటువంటి గిరిజనేతరుల భూములను స్థానిక గిరిజనులు ఆక్రమిస్తున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మండల కార్యదర్శి పూనం. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జెండాలు పాతిన భూములన్నీ కూడా స్థానికేతర గిరిజనేతరులకు చెందినవని, ఎన్నో ఏళ్లగా వారు ఈ ప్రాంతంలో ఉండడం లేదన్నారు. అట్టి భూములకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని, మళ్లీ ఆ భూములను స్థానిక రైతులకు కౌలుకు ఇచ్చి లబ్ధి పొందడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిన భూములు ప్రభుత్వ భూములుగా పరిగణలోకి వస్తాయని ఆ భూములను పేద గిరిజన ప్రజలకు పంచడం న్యాయమని ఈ పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కారం సుందరయ్య, సోడి. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



స్థానికేతరుల భూముల్లో జెండాలు పాతుతున్న దృశ్యం



కాఫీ తోటలను పరిశీలిస్తున్న ఆదిత్య గోష్టెన్

పిఎం జన్‌మన్ పథకాల అమలు సంతృప్తికరం

-కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సెక్షన్ అధికారి ఆదిత్య గోష్టెన్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మండలంలో కేంద్ర వ్యవహారాల శాఖ సెక్షన్ అధికారి ఆదిత్య గోష్టెన్ పర్యటించి కేంద్ర ప్రభుత్వం ఆదివాసి గిరిజనుల (పివిటిజి) సంక్షేమానికి అభివృద్ధికి అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఆదివారం పాడేరు మండలం మోదాపల్లి గ్రామంలో కాఫీ తోటలను పరిశీలించారు. కాఫీ తోటలు, మిరియాల సాగులో రైతులు ఏడాదికి ఎంత ఆదాయం పొందుతున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. కాఫీ, మిరియాల సాగులో ఎకరాకు ఏడాదికి రూ.లక్ష రూపాయలు ఆదాయం వస్తుందని రైతులు వివరించారు. వనుగుపల్లి పంచాయతీ ముంతమామిడి గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన బహుళ ప్రయోజన భవనాన్ని పరిశీలించారు. బహుళ ప్రయోజన భవనాల ఉపయోగాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మోదాపల్లి, వంతాడపల్లి పంచాయతీ సప్పిపుట్టు పివిటిజి గ్రామాల్లో పర్యటించారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో నిర్మించిన గృహ నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిఎం జన్ మన్ గృహాలకు నిధులు మంజూరు చేస్తున్నామని త్వరితగతిన గృహాలు నిర్మించుకొని గృహ ప్రవేశాలు చేయాలని లబ్ధిదారులకు సూచించారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు అందిన బిల్లులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సప్పిపుట్టు, మోదాపల్లి గ్రామాలలో అంగన్వాడీ భవనాలను పరిశీలించారు. పిఎం జన్ మన్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీ, పిఎం జన్ మన్ గృహాలు మంజూరు తదితర అంశాలపై అధికారులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎఇ దుర్గాప్రసాద్, ట్రైకార్ సహాయకులు ఎన్.సీతారామయ్య, పిఎంయు అధికారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గ్రామ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని ఎనిమిది పంచాయతీలలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల సంస్థాగత ఎన్నికలను జి.మాడుగుల మండల పార్టీ పరిశీలికులు ఎస్.ఏ .రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కె.కోడాపల్లి, కుంభీడిసింగి, వంతాల, పెద్దలోచలి, సొలభం, గడుతూరు, గేమ్మెలి, వంజరి పంచాయతీలలో ఏకగ్రీవంగా గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎస్ చిట్టిబాబు, జి మాడుగుల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు లొంబోరి అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షులు వంతల కొండలరావు, ప్రధాన కార్యదర్శి కిముడు కళ్యాణం, ఎస్.నాగబ్బాయి, వి. చిరంజీవి నాయుడు, ఎల్. బాలయ్య దొర, కె .బీంబాబు, కె.నితిన్ పాల్గొన్నారు.



ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు



వృథాగా పోతున్న నీరు

తాగునీరు వృథా

ప్రజాశక్తి - రంపచోడవరం : గ్రామంలోని స్థానిక పీఎంఆర్సి ఎదురుగా పంచాయతీ కుళాయి నుంచి కొద్ది రోజులుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం స్థానిక పిఎంఆర్సి వద్ద ఉన్న పంచాయతీ కుళాయికి టాప్ లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ..!

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటషెడ్ ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. గత 20 ఏళ్లగా వంటషెడ్ ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టలేదు. ఐదేళ్ల క్రితం పాఠశాల ప్రహరీ నిర్మాణానికి పునాదులు వేసి అసంపూర్తిగా వదిలేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యాకమిటి చైర్మన్ విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఎండ, వానకి ఆరుబయట వంటలు చేస్తూ కుక్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంటషెడ్ శాశ్వతంగా నిర్మించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రహరీ కూడా నిర్మించాలని కోరుతున్నారు.

అక్రమ క్వారీ తవ్వకాలు జరిపిన వారిపై చర్యలేవీ?

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

ప్రజాశక్తి - రంపచోడవరం: రంపచోడవరం మండల కేంద్రానికి కూత వేటు దూరంలో బోర్నగూడెంలో ఆక్రమ క్వారీ తవ్వరాల వల్ల ఏర్పడ్డ గోతిలో పడి ఒక గిరిజన బాలుడు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్ళిన సంఘటనపై ఏం చర్యలు తీసుకున్నారో అధికారులు సమాధానం చెప్పాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతారామారావు డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా బోర్నాగూడెంలో అక్రమ తవ్వకాలు నిర్వహించడమే కాకుండా, పర్మిషన్ లేకుండా బ్లాస్టింగ్ నిర్వహిస్తే పోలీస్‌అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. రంపచోడవరం నియోజకవర్గంలో పలు అక్రమ క్వారీలు నడుస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.



లోతా రామారావు

వర్షంతో బోసిపోయిన వారపు సంత

ప్రజాశక్తి -సీలేరు : జికె వీధి మండలం సీలేరులో వర్షం కారణంగా ఆదివారం వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వారంరోజుల నుంచి సీలేరు పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. తిరిగి మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకూ వర్షం కురవడంతో సంతకు వచ్చిన గిరిజనులు సరుకులు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడ్డారు.



వర్షం కురవడంతో ఖాళీగా ఉన్న సంత రోడ్డు

150 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో రంపచోడవరం సిరిగిందలపాడులో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. సుమారు 150మందికి వైద్యపరీక్షలు చేశామని, 54 మందికి రక్తపరీక్షలు, 5గురికి థైరాయిడ్, నలుగురికీ ఇసిజి, చేసినట్లు స్వామీజి తెలిపారు. గుండెవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ పోతుల రామారావు, బిపి, షుగర్, గుండె జబ్బులపై రోగులకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరం లో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమమహేష్. డాక్టర్ రాయుడు శ్రీనివాస్, క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎపిఎస్ ఆర్‌టిసి ఎంఎంఎస్ నారాయణ

బస్ పాస్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కూనవరం: గోకవరం ఎపిఎస్‌ఆర్టిసి ఆధ్వర్యంలో కూనవరం మండల బస్టాండ్ ఆవరణలో స్కూలు పిల్లలకు దివ్యాంగులకు బస్సుపాస్ క్యాంప్ నిర్వహించారు. 103 మనీ పాసులు 23, పిహెచ్‌సి పాసుల కోసం 9 దరఖాస్తులు స్వీకరించామని ఎపిఎస్‌ఆర్టిసి ఎంఎంఎస్ నారాయణ తెలిపారు. టి.వి.డిఎన్ రావు. ఎస్‌డిఎస్‌శబరి దివ్యాంగుల సంఘంకో ఆర్డినేటర్ రవి కూనవరం సామాజిక కార్యకర్త రాజు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్ష పదవి గిరిజనులకే ఇవ్వాలి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలో భూములు పట్టాదారు పాస్ పుస్తకాలు 80 శాతం మంది ఓటర్లు గిరిజనులే ఇందులో డైరెక్టర్లు ఉండగా, సొసైటి అధ్యక్షులుగా మాత్రం గిరిజనేతరులే ఉంటున్నారని, ఇప్పుడు గిరిజనులకే సొసైటీ అధ్యక్ష పదవి ఇవ్వాలని సొసైటి డైరెక్టర్ గంపా నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సొసైటీలో గిరిజన డైరెక్టర్లు ఉన్నప్పటికీ వారికి అధ్యక్ష పదవి ఎందుకు ఇవ్వకూడదో అభ్యంతరాలు తెలపాలని ప్రశ్నించారు. గిరిజనులకు ఇవ్వకపోతే సొసైటిలో జరుగుతున్న అవినీతిని, అవకతవకలను పూర్తిస్థాయిలో సమాచార చట్టప్రకారం బట్టబయలు చేస్తామన్నారు.

టిడిపి నాయకులకేనా అన్ని పదవులు

రాజవొమ్మంగిలో టిడిపి నాయకులకు మాత్రమే అన్ని పదవులు ఇస్తున్నారని ఇది సరికాదని బిజెపి నాయకులు లోచల రాజబాబు ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాజవొమ్మంగి సొసైటి అధ్యక్ష పదవి ఎవరికి చెప్పి ఇచ్చారని బిజెపిలో ఉన్న గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టార్పాలిన్‌లను సద్వినియోగం చేసుకోండి



టార్పాలిన్‌ను అందజేస్తున్న డైరెక్టర్

ప్రజాశక్తి - చింతపల్లి : భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) సహకారంతో లంబసింగి ట్రైబల్ ప్రొడక్ట్ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ ద్వారా అందజేసిన టార్పాలిన్‌లను సద్వినియోగం చేసుకోవాలని ట్రైబల్ ప్రొడక్ట్ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ పిఓ డైరెక్టర్ ఇంద్రరాణి సూచించారు. ట్రైబల్ ప్రొడక్ట్ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సహకారంతో అందజేసిన టార్పాలిన్ లను సొసైటీలో సభ్యులు గా ఉన్న ఎస్‌సి రైతు సభ్యులకు బోర్డు సభ్యుల సమక్షంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతు ఉత్పత్తి దారు సంఘంలో సభ్యులుగా ఉన్న ఎస్ సీ రైతులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తి దారుల కంపెనీలో చేరడంతో నాబార్డ్, భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ద్వారా అందించే పథకాలు వినియోగించుకోవచ్చని సూచించారు. చిరుధాన్య విత్తనాలైన కొర్రలు, చోళ్ళు,సామలు, జొన్నలు కూడా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఉచితంగా పొందాలని ఆమె కోరారు.



సూపరింటెండెంట్ కృష్ణారావును అభినందిస్తున్న సిబ్బంది, ట్రస్టు సభ్యులు

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- హుకుంపేట: అనకాపల్లి జిల్లాకు చెందిన ఎన్‌టిఆర్ వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ కృష్ణారావు ఆధ్వర్యంలో డి.శరద ట్రస్ట్ సహకారంతో గ్రామ సర్పంచ్ రేగం రమేష్ పర్యవేక్షణలో కొంతిలి పంచాయతీ చావడి వద్ద ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ, "చికిత్స కంటే నివారణ మేలు" అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా వ్యాపించే మలేరియా, డెంగ్యూ,టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించారు.ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తీవ్రమైన కేసులకు పాడేరు జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, శరద ట్రస్ట్ సభ్యులు కిముడు చిన్న నాయుడు సహకారంతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యోగుల సంఘం నేత ప్రభుదాస్, కే. చిన్ని బాబు, పిడి నీలకంఠం, హెచ్‌ఎం అప్పల నాయుడు, ఆదివాసి మహిళ సంఘం జిల్లా నాయకురాలు హైమావతి, వైద్యులు రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పద్మనాభంలో షూటింగ్ సందడి

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం జంక్షన్లో ఆదివారం పాన్ ఇండియా సినిమా షూటింగ్ చేపట్టారు. ఆ సమయంలో వర్షం పడటంతో కొంతసేపు షూటింగ్ ఆగింది. సినిమా షూటింగ్ జరుగుతుందని తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో పండగ వాతావరణంలా మారింది. అనగాదేవి మూవీస్ ఆధ్వర్యాన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాతగా రాజా సాగి సత్యనారాయణ రాజు వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోగా రోహన్, హీరోయిన్ హారిక నూతనంగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఈ ప్రాంతానికి చెందినవారు ఎక్కువగా ఉంటూ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

డ్రైయినేజీ అధ్వానం

-రోడ్డుపైకి మురుగు నీరు
-అవస్థలు పడుతున్న వాహనదారులు, పాదచారులు

ప్రజాశక్తి హుకుంపేట: మండల కేంద్రంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీటి కాలువలు పూడుకు పోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. వర్షాలు కురిసే ప్రతిసారి రహదారులు చెత్తతో నీటి కొలనులుగా మారి పోతున్నాయి. దీంతో ప్రజలు దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలు మూసుకుని మురుగు నిలిచిపోయింది, వర్షపు నీరు కలసి రోడ్లపై పొటెత్తుతోంది. చెత్తాచెదారం ఆ నీటితో కలసి గ్రామమంతా చెత్త మయం అవుతోంది. ఈ మార్గాలలో పోగులుగా చెత్త పేరుకు పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు భరించలేని దుర్వాసన ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. స్థానికులు తమ ఆవేదనను ఇలా వ్యక్తపరుస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీసం పట్టించుకోలేదన్నారు. వర్షాకాల కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తక్షణమే మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలని స్థానికులు కోరారు.



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

ఏజెన్సీలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- ఉపాధ్యాయుల సర్దుబాటుకు ఇంకెన్నాళ్లు?
- ఎంపిపి నీలవేణి



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి ఏజెన్సీలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఎంపీపీ ఎస్టీ విభాగం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శెట్టి నీలవేణి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో ఆమె ఆదివారం మాట్లాడుతూ, పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల సర్దుబాటు కొలిక్కి రాకపోవడంతో మన్యంలోని పలు పాఠశాలలో ఇప్పటివరకు తెరుచుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలల్లోని మౌళిక వసతులను కల్పించడంతో పాటు, విద్యా సంవత్సరంలో ఉపయోగపడే విద్యాదీవెన కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే అందజేశారన్నారు. ఈ ఏడాది విద్యా వ్యవస్థలో అటువంటి చర్యలు కనిపించలేదని ఆమె విమర్శించారు. ఇప్పటికీ కిట్లు పంపిణీ పూర్తి కాలేదన్నారు.మన్య ప్రాంతానికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు ఇప్పటికీ విధుల్లో చేరలేదని, దీంతో పాఠశాలలు మూతపడ్డాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం మొదలై నెల రోజులు కావస్తున్నా ఉపాధ్యాయుల సర్దుబాటును సైతం చేయకపోవడం దారుణమన్నారు. గిరిజన ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ అవకాశాలు గిరిజనులకు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించినప్పటికీ వాటిపై చర్యలు కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన చెయాలని డిమాండ్ చేశారు. పినకోట పంచాయతీ సొలుబుంగి గ్రామానికి 12 మంది విద్యార్థులు నాటు పడవ పై వెళ్లడంపై ప్రజాశక్తి దిన పత్రికలో కథనాలు రావడంతో ప్రభుత్వం స్పందించి పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు.

పివి.నరసింహారావు జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రత్న, పూర్వ ప్రధాని కీర్తిశేషులు పివి.నరసింహారావు జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. పివి.నరసింహారావు 104వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పౌరగ్రంథాలయంలో జరిగిన పివి జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ, విదేశాల మేధావులు, సాహితీకారులు, ప్రజలచే కొనియాడబడిన అపర చాణుక్యులు, రాజనీతిజ్ఞుడు పివి.నరసింహారావు అన్నారు. సభాధ్యక్షులు ఆంధ్రా విశ్వ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ తెలుగు వారంతా పివి చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 16 భాషల్లో ప్రవీణులు, తత్వవేత్త, రాజనీతి దురంధరులు, సాహితీ వేత్త, ఆర్థిక నిపుణులు, చాణుక్యులు ఇలా ఇన్ని లక్షణాలు కల్గిన వ్యక్తులు ప్రపంచంలోనే ఉండరన్నారు. గ్రంథకర్త భాగవతుల శంకర్ నీలు మాట్లాడుతూ, పివి ప్రధానిగా పదవీ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీ చేసిన ఘోర అవమానాలు కలిచి వేసి, ఆయన అసలు గొప్పతనాన్ని తెలుగు వారికి అయినా తెలియ చేయడం కోసం తెలుగులో ఆయన జీవిత చరిత్ర రాసినట్లు తెలిపారు. పివి జీవిత చరిత్రను ఆంగ్లంలో రాసిన డాక్టర్ కె.సత్యనారాయణమూర్తి తన అనుభవాలను సభలో పంచుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పూర్వ వీసీ డాక్టర్ బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉండానే సంకల్పంతో కేంద్రంలో మానవ వనరుల శాఖను పివి.నరసింహారావు ఏర్పాటుచేశారని తెలిపారు. ఆ శాఖకు ఆయనే తొలి క్యాబినెట్ మంత్రిగా కూడా ఉన్నారన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ అధికారి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, భారత దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఎంతో సమర్థవంతంగా పూర్తి కాలం నడిపించడమే కాక, ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో శాయిరామ్ సివిఎస్, వడ్డాది ఉదయ్ కుమార్, వి.జగన్‌మోహన్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హోటల్ గదిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జి గదిలో గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కాకినాడకు చెందిన కుక్కల వాక్‌నాథ్ ఎంవిపి.కాలనీలోని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల నేపథ్యంలో గత రాత్రి నలుగురు స్నేహితులు హనుమంతు వాక పరిధిలో ఒక లాడ్జి తీసుకున్నారు. వాక్‌నాథ్ ఆరోగ్యం బాగా లేక ట్యాబ్లెట్ వేసుకొని పడుకున్నారు. నిద్రలోనే గుండె పోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- మినీ అంగన్వాడీ కార్యకర్త దుర్మరణం

ప్రజాశక్తి- కశింకోట : బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం మండలంలోని తీడ గ్రామ మినీ అంగన్వాడీ కార్యకర్త దుంగల విజయలక్ష్మి (38) మృతి చెందారు. సంఘటన వివరాలివి.
మండలం తీడ గ్రామానికి మినీ అంగన్వాడీ కార్యకర్త దుంగల విజయలక్ష్మి, ఆమె భర్త దుంగల శ్రీను విశాఖపట్నంలోని సాయి కాలేజీలో చదువుతున్న తమ పెద్దకొడుకును చూసేందుకు ఆదివారం ఉదయం బైక్‌పై బయలు దేరారు విశాఖ జిల్లా పినగాడి వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై వెనుకన కూర్చున్న విజయలక్ష్మి రోడ్డుపై తూలిపడి, అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. ఆమె భర్త శ్రీనుకు తీవ్రగాయాలుకాగా, చికిత్సకు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. విజయలక్ష్మి మృతితో ఆమె స్వగ్రామం తీడలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి ఇద్దరు కొడుకులున్నారు. విషయం తెలుసుకున్న పలువురు అంగన్వాడీలు విజయలక్ష్మి ఇంటికి వెళ్లి పరామర్శించి, సంతాపం తెలిపారు.



వేములవలసలో పట్టుబడిన మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస పాత బ్రిడ్జి సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులుచేశారు. సిఐ నేతృత్వంలో పోలీసులు సత్య పాన్ షాప్ వద్ద తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఉంచిన తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యాజమాని సత్యంపై కేసు నమోదు చేశారు. మద్యం అక్రమ వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ వాసునాయుడు హెచ్చరించారు.

21 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టివేత

భీమునిపట్నం : పెట్రోలింగ్‌లో భాగంగా స్థానిక ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఎస్ఐలు బి.వెంకటరాజు, కె.అనీల్‌కుమార్, సిబ్బంది ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని రాయిపాలెంలో డిఫెన్స్ మద్యం అమ్ముతున్న పి.కృష్ణవేణిని అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 21 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆమెను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నేటితో ముగియనున్న సాల్వ్ ఫర్ టుమారో -2025 దరఖాస్తుల గడువు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: భారతదేశంలోనే అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్ బ్రాండ్ శాంసంగ్ ఇండియా సాల్వ్‌ఫర్ టుమారో 2025 నాల్గో ఎడిషన్ దరఖాస్తుల గడువు నేటితో ముగియనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధి ఆదిత్య మాట్లాడుతూ ఈ పోటీలో పాల్గొని తమ ఇంక్యుబేషన్ ప్రోగ్రాంను విజయవంతంగా ప్రదర్శించిన మొదటి నలుగురికి రూ.1 కోటి రూపాయల గ్రాంట్ లభిస్తుందని, ఆయన అన్నారు. ఈ పోటీలో పాల్గొనే వారికి ఐఐటి ఢిల్లీ అధ్యాపకుల నుండి సహకారం లభిస్తుందని, తమ ప్రాజెక్టుల నిర్వహణకు నిపుణుల నుండి మార్గదర్శకాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఆరు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 14 -22 సంవత్సరాల వయసు గల విద్యార్థులను వారి సాంకేతిక ఆలోచనలు సమర్పించాల్సిందిగా తాము ఆహ్వానిస్తున్నామని ఈ సంవత్సరం పోటీల్లో పాల్గొనేవారు సమగ్ర భారత దేశం కోసం ఎఐ, ఆరోగ్యం పరిశుభ్రత , విద్య, క్రీడలు, సాంకేతికతతో సామాజిక మార్పు, సాంకేతికత ద్వారా పర్యావరణ సుస్థిరత్వం వంటి అంశాలపై ప్రాజెక్టు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని 2025 ఏప్రిల్ 29న విశాఖ నుండి ప్రారంభించామని ఆయన తెలిపారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కూటమి అడ్డుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోవలసిన బాధ్యత రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై ఉందని, స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్,ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం 1583వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ పేరుతో కేంద్రం ఇచ్చిన రూ.1440 కోట్లను, వివిధ రూపాలలో కేంద్ర ప్రభుత్వం, బ్యాంకుల అప్పులకు జమ చేస్తున్నారని చెప్పారు. ప్లాంట్ ఉత్పత్తికి దోహదపడే విధంగా ఈ నిధులను ఖర్చు చేసే అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. ఉద్యోగులకు తొమ్మిది మాసాలుగా 25 శాతం కోత విధిస్తూ జీతాలు చెల్లిస్తున్నారని, విఆర్‌ఎస్ పేరుతో పర్మనెంట్ ఉద్యోగులను తొలగిస్తున్నారని, అదేవిధంగా ఎన్నో ఏళ్లగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సుమారు 4 వేల మందిని అక్రమంగా తొలగించారని ఆరోపించారు. ఈ వాస్తవ పరిస్థితిని కూటమి నాయకులు గుర్తించి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఎస్.ప్రసాద్, కార్యదర్శి డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని మురళివారి పాలెం గ్రామ సమీపంలో శనివారం రాత్రి ప్రభుత్వభూమి నుండి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 5 ట్రాక్టర్లు, ఒక జెసిబిని సీజ్ చేసినట్లు స్థానిక తహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఆదివారం తెలిపారు. పట్టుకున్న వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహశీల్దార్ తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులకు 1588 దరఖాస్తులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని కొత్త రేషన్‌కార్డులకు ఇప్పటివరకూ 1588 మంది దరఖాస్తు చేసుకున్నారని స్థానిక తహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఆదివారం తెలిపారు. అందులో ఇప్పటివరకు 990 కార్డులు పరిశీలన అనంతరం అప్రూవల్ చేశామన్నారు. అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు.


త్వరలో ప్రతి గ్రామానికీ 4జి సేవలు

వచ్చే ఏడాదికి 5జి.. తొలుత పోర్టుల్లో ప్రవేశపెడతాం

ఉమ్మడి విశాఖ జిల్లాలో 70 టవర్ల ఏర్పాటుకు ఆమోదం

'ప్రజాశక్తి'తో బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.విలియమ్స్





ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రతి గ్రామానికీ బిఎస్ఎన్ఎల్ 4జి నెట్‌వర్క్ సేవలు అందించడమే తమ లక్ష్యమని బిఎస్ఎన్ఎల్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.విలియమ్స్ తెలిపారు. సర్వీసులను మెరుగుపరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

బిఎస్ఎన్ఎల్ 4జి నెట్ వర్క్ సేవలు ఎంతవరకు వచ్చాయి ?

ఉమ్మడి విశాఖ అంతటా బిఎస్ఎన్ఎల్‌లో 4జి సేవలు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి వాస్తవం.

దీనిని గమనించి 2, 3 సంవత్సరాలుగా 4జి ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఎట్టకేలకు ఆమోదం వచ్చింది. ప్రస్తుతం 4జి సేవలు పట్టణ ప్రాంతాల వరకు మాత్రమే అందుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో 3, 4 మాసాలలో 4జి సేవలను అందుబాటులోకి తేవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా సిగ్నల్ లేని గ్రామాలలో 4జి నెట్ వర్క్ ఏర్పాటు చేయాలనేదే మా ధ్యేయం. సిగ్నల్ లేదన్న సమాచారం గ్రామాల నుంచి వస్తే ఆ ప్రాంతంలో కొత్త టవర్లు ఏర్పాటు చేస్తాం. ఉమ్మడి జిల్లాలో 105 లొకేషన్లలో కొత్త టవర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా 70 టవర్లకు ఆమోదం వచ్చింది. నెల రోజులులోగా ఆ టవర్లు ఏర్పాటు చేస్తాం. మిగిలిన 35 టవర్లకూ ఆమోదం వస్తుందన్న నమ్మకం ఉంది. కేవలం బిఎస్ఎన్ఎల్ మాత్రమే కాకుండా ఇతర నెట్ వర్క్ మొబైళ్లకు సిగ్నల్స్ అందని పరిస్థితి ఉంటే, మాకు ఫిర్యాదు చేస్తే, అటువంటి చోట్ల కూడా బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేస్తాం. కొత్త టవర్లు ఏర్పాటు చేయడం వల్ల వాయిస్ బాగా రావడంతో పాటు, డేటా అందుతుంది.

ఫైబర్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి ?

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 వేల వరకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి.

స్మార్ట్ ఫోన్లలో వచ్చే తప్పుడు సమాచారంతో అనేకమంది వినియోగదారులు భారీగా డబ్బు నష్టపోతున్నారు ? దీనిపై ఏమంటారు ?

నిజమే. సైబర్‌క్రైమ్ నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఆధునికంగా అన్ని పద్ధతులనూ ప్రవేశపెట్టే చర్యలు చేపడతాం. అయితే వినియో గదారులు తమకు వచ్చే ప్రతి కాల్‌కు రెస్పాండ్ కావద్దు. స్క్రీన్‌పై వచ్చే నెంబర్‌తో వారికి పరిచయం ఉంటే తప్ప మాట్లాడకపోవడం మంచిది.

తప్పుడు కాల్స్ వల్ల నష్టపోతే ఫిర్యాదు చేసే అవకాశముందా ?

తప్పనిసరిగా ఉంది. ఎవరికైనా ఇటువంటి పరిస్థితి వస్తే సైబర్ క్రైమ్ 1930 నెంబర్‌కు సాధ్యమైనంత తొందరగా ఫిర్యాదు చేయాలి. అటువంటి ఫిర్యాదులు అందిన వెంటనే తగు చర్యలు తీసుకొని బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తాం. ఫిర్యాదు ఆలస్యంగా చేస్తే కొన్ని ఇబ్బందులు ఉంటాయి.

బిఎస్ఎన్ఎల్ టవర్ల విషయాలు తెలియజేస్తారా ?

ఉమ్మడి విశాఖ జిల్లాలో 470 టవర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ఆ దిశగా చర్యలు తీసుకొని ఇప్పటికే 363 టవర్లు ఏర్పాటు చేశాం. 4జి కారణంగా టవర్లు ఏర్పాటు తప్పనిసరి అయింది.

5జి సేవలు వచ్చే అవకాశం ఉందా ?

తప్పనిసరిగా ఉంది. 2026 నాటికి 5జి నెట్ వర్క్ సేవలు అందివ్వాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. కేవలం ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేటు రంగంలో కూడా 5జి సేవలు ప్రవేశ పెట్టాలని భావిస్తున్నాం. ముందుగా విశాఖపట్నం పోర్టు, అలాగే అదానీ పోర్టు వారికి 5జి నెట్ వర్క్ ఇవ్వాలని అనుకున్నాం. విశాఖపట్నం పోర్టు వారితో మాట్లాడాం. వారు సుముఖంగా ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

యుటిఎఫ్ నాయకులు పండా కిష్టయ్య

ప్రజాశక్తి - చింతూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అల్లూరి జిల్లా కమిటి ఆధ్వర్యంలో చింతూరు డివిజన్ నాలుగు మండలాల ప్రాంతీయ కార్యవర్గ సమావేశం కూనవరం మండలంలోని జిపిఎస్ టేకులబోరు పాఠశాలలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.కన్నారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అల్లూరి జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు పండా కిష్టయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని పనిచేయాలనీ, భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాల మనుగడ రోజూ రోజకు ప్రశ్నార్థకంగా మారుతోందని, ప్రభుత్వ పాఠశాలలను రక్షించవలసిన బాధ్యత మన అందరిపై ఉందని కోరారు. నాలుగు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు, ముత్తయ్య, జగదీష్, డివివి. సత్యనారాయణ, బ్రహ్మయ్య, రాజారావు, ఐటిడిఎ సబ్‌కమిటి సభ్యులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కిష్టయ్య

ఎపిఇపిడిసిఎల్ సిజిఎంకు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఎపిఇపిడిసిఎల్ సిజిఎంగా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన ఎల్.మహేంద్రనాథ్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా సభ్యులు ఆదివారం అభినందించారు. ఆదివాసి ముద్దుబిడ్డ అయిన మహేంద్రనాథ్ విద్యుత్ శాఖలో సిజిఎంగా పదోన్నతి పొందడం ఆదివాసీ ప్రాంతానికే గర్వకారణం అని సభ్యులు తెలిపారు.

ఆయనను కలిసిన వారిలో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కమిటి ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్, కోశాధికారి సీసా శోభన్, ఎగ్జిక్యూటివ్ కమిటి మెంబర్లు వంతల ఆనందరావు కోటిబాబు ఉన్నారు.



మహేంద్రనాథ్‌ను అభినందిస్తున్న గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసుల ఆధ్వర్యంలో నాకాబంది

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 48 ముఖ్య కూడళ్లలో శనివారం రాత్రి 9 గంటల నుండి 10 గంటల వరకు నగర పోలీస్‌కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఆధ్వర్యంలో నాకాబంది నిర్వహించారు. దీనిలో భాగంగా అక్రమ రవాణా పూర్తిగా అరికట్టే విధంగా ప్రతి వాహనానికి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం, గంజాయి ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మద్యంతాగి వాహనం నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటం, అధికలోడు ఉన్న వాహనాలు, వాహన రికార్డుల పరిశీలన చేపట్టారు. ఈ తనిఖీల్లో మొత్తం 115 వాహనాలను తనిఖీ చేయగా వాటిలో హెల్మెట్లు లేని వారిపై 60, సక్రమంగా నంబర్‌ప్లేట్ లేని వాహనాలు 16, ట్రిపుల్‌రైడింగ్ 12 సెల్ ఫోన్ డ్రైవింగ్‌తోపాటు ఇతర కారణాల వల్ల 19 వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్: ప్రజానాట్య మండలి ఉత్తరాంధ్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు రాజాన దొరబాబు కోరారు. ప్రజల చైతన్యం చేస్తూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టే బాధ్యతను ప్రజానాట్య మండలి తీసుకోవాలన్నారు. ఆదివారం కోడుగంటి గోవిందరావు భవనంలో ప్రజానాట్యమండలి సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు రాజునాయుడు, దేముడుబాబు మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, 45ఏళ్లు నిండిన వారికి ప్రతినెలా రూ.ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. తెలంగాణలాగా ఎపి ప్రభుత్వం కూడా సాంస్కృతిక మండలి ఏర్పాటు చేసి కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.